
సాక్షి కుమురం భీం

శుక్రవారం । 13 । జనవరి । 2023



'అమ్మ' చెంత అదే చింత

వసంత పంచమి సందర్భంగా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. అక్షరాభ్యాస పూజలకు తగిన ఏర్పాట్లు చేయలేదు. IIలో▸

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో 2023- 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. 6వ తరగతిలో 100, 7 నుంచి పదో తరగతిలో మిగిలిన సీట్లకు ఫిబ్రవరి 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /16.8

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో చలి తీవ్రత కాస్త తగ్గుతుంది. ఏజెన్సీలో శీతల గాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

దీక్ష తీసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



పూజా కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలం జంగాం గ్రామంలో గురువు భగవత్ ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జైజంగో జైలింగో దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి గొప్పదని, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పుష్యమాసంలో కఠోర నియమాలతో నెల రోజులపాటు దీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దైవ చింతనతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు, జెడ్పీటీసీ ద్రుపదాబాయి, సర్పంచ్ శ్యాంరావ్, రమాకాంత్, ఎంపీడీవో భగవంత్‌రావు, ఎంపీటీసీ భగవంత్‌రావ్, సంస్థానం అధ్యక్షుడు రఘునాథ్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నంబర్ 10 తిలక్‌నగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది చేపట్టిన సర్వేను పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం సిబ్బందికి సూచనలు అందించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'కంటి వెలుగు' సమర్థవంతంగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ బడ్జెట్ సమావేశానికి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అధికారులు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కోసం కార్యాచరణ రూపొందించాలన్నారు. చేపట్టాల్సిన పనులు, ఖర్చుల వివరాలతో పూర్తిస్థాయి నివేదిక అందించాలని ఆదేశించారు. మొదటి విడత విజయవంతం చేసిన స్ఫూర్తితో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ సద్దాం హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వైస్ చైర్మన్ రాచకొండ గిరీశ్, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు



వివేకానంద చౌక్‌వద్ద సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా యువశక్తికి వివేకానందుడు స్ఫూర్తి ప్రదాత అని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్, వివేకానంద సేవా సమితి ఉపాధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాండ్రె విశాల్, సెర్ల మురళీ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద వాసవీక్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత సనాతన శక్తి, ధార్మిక విలువలను ప్రపంచానికి చాటిన మహనీయులు స్వామి వివేకానంద అని కొనియాడారు. యువత ఆయన ఆదర్శంగా తీసుకుని విలువలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నాయకులు సతీశ్‌బాబు, వేణుగోపాల్ పేదలకు నిత్యావసరాలతోపాటు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమంలో అర్జున్‌రెడ్డి, సొల్లు లక్ష్మి, గణేశ్, కృష్ణ, అభిలాష్, గుండా సాయి, రవి, ఎకిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ రద్దీ..!

జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఆనందంగా ఇంటి బాట పట్టారు. ఉద్యోగులు, విద్యార్థులు పండుగ కోసం సొంతూళ్లకు వెళ్తుండటం, జిల్లాకు చెందిన వారు హైదరాబాద్, కరీంనగర్‌తోపాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి ఇళ్లకు చేరుకుంటుండటంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో రద్దీ కనిపిస్తోంది.

- స్వస్థలాలకు వెళ్లేందుకు ప్రజల అవస్థలు
- ఇంటిబాట పట్టిన వసతి గృహాల విద్యార్థులు
- కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు
- జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఐదు ప్రత్యేక బస్సులు
- రద్దీకి సరిపడా ఏర్పాట్లు లేకపోవడంతో తప్పనిపాట్లు



ఆసిఫాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్: జిల్లాలోని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. స్వస్థలాలకు వెళ్లే వారికి తగినన్ని వాహనాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో బస్సులో కెపాసిటికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఓ వైపు బస్సు కొరత ఉండగా, మరో వైపు లగేజీలతో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక టికెట్ ఇచ్చేందుకు కండక్టర్‌కు కూడా చోటు దొరకడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బస్సుల్లో రిజర్వేషన్లు దొరక్కపోవడంతో హైదరాబాద్ నుంచి వచ్చేవారు నాలుగైదు బస్సులు మారాల్సి వస్తోంది. ఏటా సంక్రాంతి ముందు బస్సుల సమస్య ఉండడంతో కొంతమంది సొంత వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఆర్టీసీ వెళ్లని గ్రామాలకు కూడా ఆటోలు ప్రైవేటు వాహనాలు కూడా కిక్కిరిసి వెళ్తున్నాయి. పండగ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఐదు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా రద్దీకి సరిపోవడం లేదు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రోడ్, సిర్పూర్(టి) రైల్వే స్టేషన్లలో వచ్చిపోయే అన్ని రైళ్లు కిటకిటలాడుతున్నాయి. భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చోటు దొరక్కపోవడంతో చాలా మంది ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు.

మార్కెట్‌లో సందడి

జిల్లాలోని కిరాణా దుకాణాలు పండుగ కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, మండల కేంద్రాలు సందడిగా మారాయి. సకినాలు, అరిసెలతోపాటు పిండి వంటలు తయారు చేసుకునేందుకు అవసరమైన నువ్వులు, నూనె, బెల్లం, బియ్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. అలాగే మహిళలు కొత్తగా నోములు నోముకునేందుకు అవసరమున్న సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

ఆర్టీసీకి ఆదాయం

సంక్రాంతి పండగ సందర్భంగా బస్సుల్లో రద్దీ పెరగడంతో ఆర్టీసీకి గణనీయంగా ఆదాయం సమకూరుతోంది. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు రోజుకు సుమారు రూ.14 లక్షల ఆదాయం వస్తుండగా పెరిగిన రద్దీతో గురువారం సుమారు రూ.1.5 లక్షల అదనపు ఆదాయం వచ్చింది. పండగ సమీపిస్తుండడంతో శుక్ర, శనివారాల్లో మరింత ఆదాయం వస్తుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్ మీదుగా పామూరు, కందికూరు, రాజమండ్రి, గుంటూరుకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీధర్ తెలిపారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహం నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో జిల్లాలోని ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ వసతి గృహాలు, కళాశాలల విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం ఉదయం నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్లేందుకు వసతి గృహాలు, పాఠశాలలకు చేరుకున్నారు. కొంత మంది ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకోగా, మరి కొంతమంది ఆర్టీసీ బస్సుల్లోనే వచ్చారు. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా తీసుకునన్న పలువురు ప్రైవేటు వాహనదారులు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో ఉన్నత చదువులకు వెళ్లిన వారు స్వస్థలాలకు వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. ఆర్థిక భారమైనా చాలా మంది సొంత వాహనాల్లో హైదరాబాద్‌కు వెళ్లి పిల్లలను తీసుకువస్తున్నారు.



సీటు కోసం పోటీ పడుతున్న ప్రయాణికులు



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ బస్టాండ్‌లో విద్యార్థుల రద్దీ

మానసికోల్లాసం కోసమే స్పోర్ట్స్‌మీట్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ముగిసిన జిల్లా 'స్పోర్ట్స్ అండ్ గేమ్స్'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజల రక్షణకు నిత్యం విధుల్లో ఉండే పోలీసుల మానసికోల్లాసం కోసమే స్పోర్ట్స్ మీట్ నిర్వహించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ జిల్లా యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో గురువారం ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, పోలీసులు ఒత్తిడి, అలసటను అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. వ్యాయమాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శిక్షణ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. రెండు నెలలపాటు శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సొసైటీ సీఈవో యాసీన్ తెలిపారు. అంతకు ముందు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువ చైతన్య ఫౌండేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, అధ్యాపకులు సుచిత్, భీంరావు, జ్యోతి, నరేష్, ప్రియాక తదితరులు పాల్గొన్నారు.

16న కాగజ్‌నగర్‌లో భారీ బహిరంగ సభ

- సిర్పూర్ నియోజకవర్గంలో అరాచక పాలన
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 16న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. బహుజన రాజ్యాధికార యాత్ర ముగింపును పురస్కరించుకుని గురువారం సాయంత్రం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిర్పూర్ నియోజకవర్గంలో అరాచక పాలన కొనసాగుతోందని, అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. యాత్రలో భాగంగా పేపర్ మిల్లు కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నానని పేర్కొన్నారు. మిల్లు మేనేజ్‌మెంట్ స్థానిక కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని, స్థానికేతరులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ సైనికులకు హాని జరిగితే పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని స్పష్టం చేశారు.

అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

బెజ్జూర్(సిర్పూర్): బీఎస్పీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చారు. బెజ్జూర్ మండలం కుకుడ, పోతేపల్లి, సలుగుపల్లి, కోర్తగూడ గ్రామాల్లో గురువారం పర్యటించారు. బెజ్జూర్‌లో ఆయన మాట్లాడుతూ బెజ్జూర్‌లో 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి యాది మరిచారన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షుడు రాంప్రసాద్, నాయకులు జ్యోతి, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, ముఖ్తియార్, రూమి తదితరులు పాల్గొన్నారు.

దొంగలొస్తున్నారు.. జాగ్రత్త!

- రెబ్బెన, కాగజ్‌నగర్‌లో ఇటీవల చోరీలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- పండగ పూట మరింత రెచ్చిపోయే ప్రమాదం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీస్‌శాఖ



కౌటాల(సిర్పూర్): జిల్లాలో వరుస చోరీలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కాగజ్‌నగర్ పట్టణంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల దొంగతనాలు పెరిగాయి. తాజాగా గురువారం రెబ్బెన, కాగజ్‌నగర్‌లో యజమానులు లేని సమయంలో ఇళ్ల నుంచి విలువైన ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. సొంతూళ్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

వరుస చోరీలు..

జిల్లాలోని కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల, రెబ్బెన మండలాల్లో దొంగతనాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండటం లేదు. పెట్రోలింగ్, తనిఖీలు, కార్డన్‌సెర్చ్ నిత్యం కొనసాగుతున్నా అందరి కళ్లుగప్పి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పగలురాత్రి అని తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆలయాల్లో వరుస ఘటనలు జరుగుతున్నాయి. గతేడాది ఆలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడిన దుండగులు.. ప్రస్తుతం ఇళ్ల మీద పడ్డారు. జిల్లాలోని సగం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. కాగజ్‌నగర్, రెబ్బెనలో రైల్వే మార్గాలు ఉండడంతో పొరుగురాష్ట్రం నుంచి ఇటు వైపు వచ్చి చోరీలకు పాల్పడుతున్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. దేవాలయాల్లోని హుండీలను పగలగొట్టి అందిన కాడికి నగదు దోచుకెళ్లిన వారే మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతర రాష్ట్రాల వారు కావడంతోనే త్వరగా పట్టుబడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే మేలు


- ఊరికి వెళ్తున్న విషయాన్ని చుట్టుపక్కలా వారికి తెలియజేసి తమ ఇంటిని చూస్తూ ఉండమని చెప్పాలి.
- కుటుంబ సభ్యులందరూ ఊరికి వెళ్తే విలువైన ఆభరణాలను వెంట తీసుకెళ్లాలి. లేకుంటే బ్యాంకు లాకర్స్‌లో భద్రపర్చుకోవడం మేలు.
- విలువైన వస్తువులను బీరువాలో ఉంచొద్దు. ఇంట్లో ఎక్కువగా నగదు లేకుండా జాగ్రత్త పడాలి.
- తాళం వేసి ఊరు వెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. తద్వారా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పోలీసులు ఇంటిని గమనించేందుకు ఆస్కారం ఉంటుంది.
- రాత్రివేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలి.
- కొందరు సామగ్రి విక్రయిస్తున్నట్లుగా పగలంతా కాలనీల్లో తిరుగుతారు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రిపూట చోరీకి పాల్పడే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా అనుమానంగా తిరిగే చిరువ్యాపారులపై కన్నేసి ఉంచాలి.
- వృద్ధులు, చిన్నపిల్లలు రాత్రివేళల్లో ఇంట్లో ఉంటే ఎవరూ తలుపు కొట్టినా తీయొద్దని చెప్పాలి. ఇంటి డోర్ ముట్టుకోగానే సౌండ్ వచ్చే విధంగా సైరన్ ఏర్పాటు చేసుకుంటే మంచిది.
- ఇంటి బయట, హాల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

రెబ్బెనలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రానికి చెందిన కొల్లి విజయలక్ష్మి ఇంట్లో గుర్తుతెలియని దొంగలు నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై భూమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విజయలక్ష్మి భర్త నాగేశ్వర్‌రావుతో కలిసి ఈ నెల 8న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి చేరుకోగా.. తాళం తీసి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. బీరువాలో రూ.2.5లక్షల నగదుతోపాటు రూ.లక్ష విలువైన 3.5 తులాల బంగారు నెక్లెస్ చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆసిఫాబాద్ నుంచి క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బడిలో సంక్రాంతి సంబురాలు





రెబ్బెన మండలం పులికుంట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. గంగిరెద్దులు, భోగి మంటలు, హరిదాసు, రంగవల్లులు, గాలిపటాలతో బడి ఆవరణ కోలాహలంగా మారింది. సంక్రాంతి విశిష్టతను తెలియజేసేందుకు ఏటా సంబురాలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుర్స పోషమల్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ పోషన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన(ఆసిఫాబాద్)

ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌పై దృష్టి సారించాలి

ఆదిలాబాద్: ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ కోరారు. మంత్రిని ఢిల్లీలో గురువారం కలిసి పలు రైల్వే సమస్యలను విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ పనులకు సంబంధించిన నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. రానున్న బడ్జెట్‌లో కేంద్రమే పూర్తిగా నిధులు వెచ్చించి పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరారు. ఉమ్మడి జిల్లా ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రైళ్ల రాకపోకలను పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ వరకు నడుస్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను బల్లార్షా వరకు పొడిగించాలని కోరారు. సిర్పూర్- కాగజ్‌నగర్‌లోని సంజీవయ్యనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని, దక్షిణ్, హజ్రత్ నిజాముద్దీన్ రైళ్లను సిర్పూర్ కాగజ్‌నగర్‌లో నిలిచే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించారని, రానున్న బడ్జెట్లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 మంది డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని సాయిసమత్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఇచ్చోడ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, రెబ్బెనలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ముగ్గురు, ఆదిలాబాద్ పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు, మంచిర్యాల రిమ్స్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు.

వ్యక్తికి 15 రోజుల రిమాండ్

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇబ్రహీం అనే వ్యక్తికి స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అసుదుల్లా షరీఫ్ గురువారం పదిహేను రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీం అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమిస్తున్నానని వేధించడం, ఇంటికి వెళ్లి బైక్ హారన్ కొడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండడం, బయటకు రమ్మని బూతులు తిట్టడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 11న కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని దేవాపూర్ పరిసర గ్రామాల ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ స్థానిక ఆదివాసీలు గురువారం ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఎండి క్షేత్రపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలో స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఆదివాసీ లకు అన్యాయం చేస్తున్నారన్నారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం జంగు, ప్రధాన కార్యదర్శి మడావి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఆత్రం సంజీవ్, నాయకులు పేంద్రం ప్రభాకర్, పేంద్రం హన్మంతు, కనకరాజు, రాయిసిడాం రాందాస్, ఆత్రం మహేష్, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి



లతకు చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ

బెల్లంపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీల్లో బెల్లంపల్లి మహిళ ప్రథమ బహుమతి గెలుచుకుంది. పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో బెల్లంపల్లికి చెందిన ఆసం లత పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సంధ్యారాణి విజేతకు రూ.30వేల నగదు బహుమతి అందజేశారు.

అమ్మ చెంత అదే చింత



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం

ఈసారైనా భక్తులకు తిప్పలు తప్పేనా..?

- అమ్మవారి జన్మనక్షత్రం వేడుకలకు దగ్గరపడుతున్న ఘడియలు
- తరలిరానున్న భక్తజనం
- అదేస్థాయిలో వీఐపీల తాకిడి
- ఈసారి కూడా అరకొర వసతులే..
- కనీసం తాగునీరు కూడా దొరకని పరిస్థితి

బాసర(ముథోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో జరిగే మహోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఉత్సవం వసంత పంచమి. అమ్మవారి జన్మ నక్షత్రమైన వసంత పంచమిని శ్రీపంచమి అని కూడా అంటారు. ఈ పర్వదినం ఈ నెల 26న రానుంది. ఆ రోజు అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు బాసరకు తరలివస్తుంటారు. కానీ ఆలయంలో సరైన వసతులు, ఏర్పాట్లు లేక భక్తులు యేటా తీవ్ర ఇక్కట్ల మధ్య పూజలు చేసుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. ఎప్పటిలాగానే ఈసారి కూడా అధికారులు ఏర్పాట్లు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. వేలల్లో వచ్చే భక్తుల రద్దీని ఊహించినదే అయినా చిన్నచిన్న మార్పులు తప్పితే చొప్పుకోదగిన స్థాయిలో ఏర్పాట్లు చేయడం లేదనే చెప్పొచ్చు. వసంత పంచమికి వచ్చే భక్తులకు ఈ ఏడాది కూడా అవే కష్టాలు ఎదురుకానున్నాయి.

కొరవడిన వసతి

ఉత్సవాల్లో బాసర అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీ భక్తుల బసకు పాత ఆలయ అతిథి గృహాలను రూ.6కోట్లతో రినోవేషన్ చేసి సకల హంగులతో సిద్ధం చేశారు. కానీ సాధారణ భక్తుల బసను పట్టించుకున్న పాపన పోవడం లేదు. కేవలం రెండు వందల రూపాయల రుసుముతో బస కల్పించే టీటీడీ వసతి గృహంలో ప్రస్తుతం ఉపయోగానికి దాదాపు సగం రూములు మాత్రమే ఉన్నాయి. అవి కాస్త దీనస్థితిలో ఉండడం, ప్రైవేటు లాడ్జిల్లో వేల రూపాయలు వసూలు చేయడంతో భక్తులకు ఇబ్బంది తప్పడం లేదు.

ఏర్పాట్లలో లోపాలు

వసంత పంచమి సందర్భంగా తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. తాగునీటితో పాటు మధ్యలో అత్యవసరమైతే భక్తులు బయటకు వచ్చే పరిస్థితులు కల్పించడం లేదు. గంటల తరబడి నిల్చొనే భక్తులు కూర్చుందామంటే ఏర్పాట్లు చేయడం లేదు. ఏటా వీఐపీల కోసం క్యూలైన్లు.. అక్షర శ్రీకార పూజల కోసం గతంలో అదనపు ఏర్పాట్లు చేసిన అధికారులు సాధారణ భక్తుల విషయాలను మాత్రం గాలికి వదిలేస్తున్నారు.

సమస్యలపై దృష్టి పెట్టని అధికారులు..

గత అనుభవాలను ఆలయ అధికారులు మరచిపోయినట్లే ఉన్నారు. గత నవరాత్రి ఉత్సవాల్లో, వసంతి పంచమి వేడుకల సమయంలో భక్తులకు ఏర్పడిన అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయడం లేదు. అదనపు క్యూలైన్లు, వివిధ దిశల్లో ఆలయంలో అధికారుల పూజలు, దర్శనం త్వరగా జరిగే కోణంలో ఆలోచన చేయడం లేదు. ఆలయ పూజారులు ఉన్నా భక్తుల రద్దీకి సరిపోవడం లేదు. బయట నుంచి అదనంగా పూజారులను తీసుకోవద్దని కొందరు అర్చకులు అధికారులను కోరినట్లు సమాచారం. దీంతో భక్తుల దర్శన సమయం పెరిగి ఇబ్బందుల పాలవుతున్నారు. క్యూలైన్ల భద్రత సిబ్బందిని పెంచుతున్నప్పటికీ పూజలు నిర్వహించే పండితుల సంఖ్యను మాత్రం పెంచడం లేదు.

తాగునీరు కష్టమే..



తాగునీటిలో కప్పలు, పురుగులు

అమ్మవారి జన్మనక్షత్ర ఉత్సవాల్లో భక్తులకు కనీ సం తాగునీరు దొరకడం కష్టమే. ఇప్పటికే అక్కడక్కడ రెండు మూడు చోట్ల చిన్నవాటర్ కూల ర్లు ఉంచి ఆలయ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. గుడి దగ్గరికి వచ్చిన భక్తులు క్యూలైన్ల ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్లే దత్తాత్రి గుడి వద్ద మరొకటి టెంకాయ కొట్టు ప్రదేశం వద్ద మాత్రమే వాటర్ కూలర్లు ఉన్నా అందులో తాజాగా కప్పలు, పురుగులు దర్శనమిస్తున్నాయి. నిర్వహణ సరిగాలేక నల్లాల వద్ద ఆపరిశుభ్రత చూసి ఆ నీరు తాగడానికి కూడా భక్తులు ఇష్టపడడం లేదు. ఇప్పటి వరకు అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు మొదలైనట్లు కనిపించడం లేదు.



ఆలయ రూంలు దొరకక, ప్రైవేటు రేట్లకు తట్టుకోలేక చలిలో ఆరుబయట నిద్రపోతున్న భక్తులు (ఫైల్)

డెయిరీఫాం సీఈఓపై కేసు నమోదు

బెల్లంపల్లి: నమ్మించి మోసగించిన ఓ డెయిరీఫాం నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏకకాలంలో తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల పోలీసు స్టేషన్లలో బుధవారం బాధితులు ఫిర్యాదు చేశారు. బెల్లంపల్లి కేంద్రంగా కన్నాల శివారు ప్రాంతంలో డెయిరీఫాం నిర్మాణానికి ఓ ప్రజాప్రతినిధి భూమిపూజ చేశారు. కార్యక్రమానికి పశు సంవర్థక శాఖ అధికారులు హాజరు కావడంతో రైతులకు నమ్మకం కలిగింది. రూ.3.50 లక్షలు చెల్లిస్తే సంస్థ మరో రూ.3.50 లక్షలు కలిపి రూ.7 లక్షల విలువైన పాడిగేదెలను ప్రైవేట్ డెయిరీఫాం నిర్వాహకులు రైతులను ఆకట్టుకున్నారు. దీంతో ఆశపడ్డ రైతులు రూ.2 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు సీఈఓకు చెల్లించారు. ఆరునెలల్లోగా పాడి గేదెలు అందిస్తామని డబ్బులు తీసుకున్న నిర్వాహకులు గడువు తీరినా ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు రైతులు గ్రహించారు. బుధవారం నాటకీయంగా సీఈఓను బెల్లంపల్లికి రప్పించి నిలదీయడంతో తనవద్ద డబ్బులు లేవని చేతులెత్తేశాడు. అప్రమత్తమైన రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 60 మందికి పైగా రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మోసగించిన వ్యక్తిపై ...

కాసిపేట(బెల్లంపల్లి): సబ్సిడీపై గేదెలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గంగారాం తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కాసిపేటకు చెందిన సింగరేణి కార్మికుడు నలి గేటి రాజేందర్ వద్ద హైదరాబాద్‌కు చెందిన కందిమల్ల ఆదినారాయణ ఓరిజిన్ అనే డెయిరీఫాం బెల్లంపల్లిలో ప్రారంభించినట్లు పరిచ యం చేసుకున్నాడు. నీకు 10 గేదెలు ఇప్పిస్తానని వాటికి రూ.10లక్షలు అవుతుందని, అందులో మూడున్నర లక్షలు కడితే ఆరున్నర లక్షలు మాఫి చేయిస్తానని రాజేందర్‌ను నమ్మించాడు. తన వద్ద అంత డబ్బులు లేవని రూ.2లక్షలు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో అవి తీ సుకుని రూ.8లక్షలు మాఫీ చేయిస్తానని హామీ ఇచ్చాడు. కొద్ది రోజులకు లోన్‌కు షూరిటీగా ఖాళీ చెక్కులు మూడు కావాలని తీసుకున్నా డు. ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండానే ఖాళీ చెక్కులు నావద్ద ఉన్నాయని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన మీర్జా జావెద్ బేగ్, అంజుమ్(22) దంపతులు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. జావెద్ కూలీ పని చేస్తుండగా అంజుమ్ ఇంటివద్దే ఉంటోంది. గురువారం మధ్యాహ్నం మీర్జాజావేద్‌బేగ్ బయటకు వెళ్లిన సమయంలో అంజుమ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గంట తర్వాత ఇంటికి వచ్చిన భర్త ఇంటి బయట పిల్లలు ఏడుస్తూ ఉండటాన్ని గమనించి వెనుక తలుపు నుంచి ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సహాయంతో కిందికి దింపగా కొనఊపిరితో ఉందని తెలుసుకుని హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దంపతులకు కుమారుడు (4), కుమార్తె (1) ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఎస్సై సాగర్‌ను సంప్రదించగా మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జన్నారం(ఖానాపూర్): మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం రాయనర్సు అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టు పైనుంచి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా కాలుకున్న గుజి ఊడిపోవడంతో కిందపడిపోయాడు. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే 108 వాహనంలో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత గీత కార్మికుడికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ కోరారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని జనగామ నుంచి నాగంపేట మీదుగా టవేరా వాహనంలో 25 కలప దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో రవి తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కలపను డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.లక్షా రెండువేల రూపాయలు ఉంటుందన్నారు. అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలపను పట్టుకున్న వారిలో డెప్యూటీ రేంజర్ లావణ్య, బీట్ ఆఫీసర్ సంతోశ్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని గోదావరి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వేంపల్లి గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజలింగు హెచ్చరించారు.

పలువురి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన రేగుంట అశోక్‌ను గురువారం పోలీసులు తహసీల్దార్ రాజలింగు ఎదుట బైండోవర్ చేశారు. సదరు వ్యక్తి గతంలో గుడుంబా తయారు చేస్తూ పట్టుబడగా పలు కేసులు నమోదయ్యాయని, గుడుంబా తయారీకి పాల్పడకుండా ముందస్తుగా బైండోవర్ చేసి పూచీకత్తుపై వదిలిపెట్టారు.

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండల కేంద్రంలో గతేడాది కోడి పందేలు ఆడుతూ పట్టుబడిన 14 మందిని గురువారం ముందస్తుగా తహసీల్దార్ రాంచందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

'ఓపెన్'లో స్పెషల్ అడ్మిషన్లు

- 'పది' ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- నేటితో ముగియనున్న గడువు



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: 2022–23 విద్యాసంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి స్పెషల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. జనవరి 9 నుంచి 13 వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చదువు మధ్యలో మానేసిన వారు, ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఫెయిలైన వారంతా ఓపెన్ విధానం ద్వారా ఒకే సంవత్సరంలో పూర్తి చేసే వీలుంది. ఈ విద్యాసంవత్సరానికి గానూ ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ ఇంటర్‌లో 2,271 మంది, పదోతరగతిలో 2,490 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు.

అర్హతలు ఇవే..

2022 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండినవారు పదోతరగతి, 15 సంవత్సరాలు నిండి పదోతరగతి పాసైనవారు ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులు. పదోతరగతిలో ప్రవేశానికి జనరల్ విద్యార్థులకు రూ.1400, ఇతరులకు రూ.1000, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, ఇంటర్‌లో ప్రవేశానికి జనరల్ విద్యార్థులకు రూ.1500, ఇతరులకు రూ.1200, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

2022-23 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు

జిల్లా	ఎస్సెస్సీ	ఇంటర్
ఆదిలాబాద్	808	401
కుమురంభీం	380	278
మంచిర్యాల	589	1,144
నిర్మల్	713	448

సాగునీటికోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): యాసంగి వరి పంటకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట మండలాలకు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు రెండు గంటలకు పైగా నిర్వహించిన రాస్తారోకోతో రహదారిపై భారీసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంగ్రామ సమితి అధ్యక్షుడు నైనాల వెంకటేశ్వర్లు సీపీఐ నాయకులు రమణారెడ్డి, మేదరి దేవవరం, రైతులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీల్లో రాణించాలి

- శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి



ఎంపికైన క్రీడాకారులతో జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): కంపెనీ క్రీడాకారులు కోలిండియా పోటీల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బొగ్గు పరిశ్రమల్లో అత్యంత కీలకమైన కోలిండియా క్రికెట్ పోటీలకు సింగరేణి నుంచి పాల్గొనే జట్టుకు శ్రీరాంపూర్ నుంచి బీ.శశికాంత్, ఏనుగు రవికిరణ్, ఎస్.జగదీశ్, ఎస్.మహేశ్, చిరంజీవి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 20 వరకు డబ్ల్యూసీఎల్, నాగ్‌పూర్‌లో జరుగుతున్న కోలిండియా క్రికెట్ పోటీల్లో రాణించి గోల్డ్ మెడల్ సాధించాలన్నారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం జీఎం కార్యాలయంలో జీఎం, ఇతర అధికారులు అభినందించారు.

మెరిట్ స్కాలర్ షిప్‌ల పంపిణీ

శ్రీరాంపూర్‌లో పలువురు ఉద్యోగుల పిల్లలకు కంపెనీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసింది. ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మంజూరు కాగా జీఎం బీ.సంజీవరెడ్డి వారి తల్లిదండ్రులకు అందించారు.

ఎస్ఎల్పీ ప్రమోషన్లు అందజేత

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు జీఎం సంజీవరెడ్డి సర్వీస్ లింక్ ప్రమోషన్లు అందించారు. పదోన్నతితో మరింత ఉద్యోగ బాధ్యత పెరుగుతుందని, దానికి అనుగుణంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం త్యాగరాజు, డీజీఎం(పర్సనల్) గోవిందరాజు, డీజీఎం(ఐఈడీ) కే చిరంజీవులు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ పీఓ కాంతారావు, జీఎం కార్యాలయం పిట్ సెక్రటరీ పీవీ రావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, కెప్టెన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కంట్యాక్స్ రద్దుకు పోరాడుతాం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



కాసిపేట గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట(బెల్లంపల్లి): బొగ్గుగని కార్మికుల ఇన్‌కంట్యాక్స్ రద్దుకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జాతీయ సంఘాల ఐక్యతతో వేజ్‌బోర్డు సమావేశంలో డీపీఈ గైడ్‌లైన్స్ పక్కన పెట్టి కార్మికులకు 19 శాతం ఎంజీబీ సాధించామన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు సింగరేణి కార్మికులకు ఇన్‌కంట్యాక్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణపై క్రియాశీలక పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, నాగేశ్వరరావు, బొంకూరి రాంచందర్, మీనుగు లక్ష్మీనారాయణ, రత్నం అయిలయ్య, కామెర రాములు, రాజేందర్, రవీందర్, డీకొండ నర్సయ్య, స్వామి దాసు పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలో జీఎం పూజలు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని అబ్బాపూర్, బెజ్జాల గ్రామాల పరిధిలో ఉన్న భీమన్న ఆలయంలో ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, మేనేజర్ మహేష్‌కుమార్, ఉప సర్పంచ్ పర్వత్ రావు, కమిటీ సభ్యులు అమృత్‌రావు, రంగుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం సందర్శన

బెల్లంపల్లి ఏరియా యాజమాన్యం ఏర్పాటు చేసిన నర్సాపూర్ సింగరేణి పునరావాస కేంద్రాన్ని జీఎం దేవేందర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, మేనేజర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

బెల్లంపల్లి: బొగ్గు ఉత్పత్తిలో కార్మికుడి నుంచి మొదలుకుని మేనేజర్ వరకు రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా రక్షణాధికారి ఓదెలు అన్నారు. గురువారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని భూగర్భ గనిపై సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు, పర్యవేక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గని లో చేపట్టాల్సిన రక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు విపులంగా వివరించారు. కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి ఆర్.విజయ్ ప్రసాద్, ఎస్ఎంటీసీ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, గని మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హా , రక్షణాధికారి రాజు, పిట్ ఇంజినీర్ రాంబాబు, కార్మిక సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్, తిరుపతిగౌడ్, వెంకటరమణ, రమేశ్, అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పద్మశ్రీ కనకరాజు బృందానికి ప్రథమ స్థానం



నార్నూర్: యువజన ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన కళాపోటీల్లో జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనక రాజు కళాబృందానికి గురువారం ప్రథమ బహుమతి దక్కిందని సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగిన కళా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మార్లావాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనక రాజు గుస్సాడీ కళాబృందం మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని కర్ణాటకలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.